కళ్యాణ్‌నగర్‌లో 60 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి చర్యలు

ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ఎర్రగడ్డ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, 60 ఫీట్ల రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేసేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. శుక్రవారం కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగళ్ళ నరసింహారావు ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ తన గెలుపునకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు కొయ్యాడ రాజ్‌కుమార్ గౌడ్, నర్సింగ్‌రావు, సాయిరూపేష్, నరేంద్రబాబు, బీవీ ఆర్ చౌదరి, రాధిక, అనూష, మీనాకుమారి, విజయలక్ష్మి, రజిని తదితరులు పాల్గొన్నారు.


నవీన్ యాదవ్‌ను సన్మానిస్తున్న నరసింహారావు, తదితరులు


గ్యార్మీ వేడుకలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్

గ్యార్మీ వేడుకలో ఎమ్మెల్యే

కృష్ణానగర్ మసీదు కమిటీ సూఫీ ఆధ్యాత్మిక గురువు హజ్రత్ షేక్ అబ్దుల్ ఖదీర్ జిలానీ జ్ఞాపకార్థం జరిగిన గ్యార్మీ వేడుకలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు ఫరీద్, ఉస్మాన్, ఫైజ్, షానవాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- మధురానగర్ సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, కోశాధికారి సుష్మ, హనుమంతరావు యాదవ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను కలిశారు.


ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు సీపీఎం వినతి

బంజారాహిల్స్/యూసుఫ్‌గూడ/వెంగళరావునగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్‌ను సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు టి.సాయిశేషగిరిరావు, రాపర్తి అశోక్ మాట్లాడుతూ శిశువిహార్ ఆయాలకు పెండింగ్ వేతనాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు స్వామి, లక్ష్మణ్, రవీందర్, భిక్షపతి, బాలయ్య, దేవదాస్, భాగ్యరాజ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎంఐఎం నాయకులు షేక్ జాఫర్, షేక్ అహ్మద్, జహంగీర్ తదితరులు

ఆకట్టుకుంటున్న సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన


సిల్క్ ఇండియా ప్రదర్శనలో సందర్శకులు

బంజారాహిల్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చలి వణికిస్తోంది. మరోవైపు శుభకార్యాలు, వివాహాలు. ఈ తరుణంలో కాస్త వెచ్చదనం పంచడంతోపాటు ఫ్యాషనబుల్‌గా ఉండే ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రజలు మొగ్గు చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి అందుబాటులో ఉంచారు. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశ ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన ఈనెల 23 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నాలా వ్యర్థాలు తొలగింపు


నాలా వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

వెంగళరావునగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీ డి-బ్లాక్ పార్కు ఎదురుగా నాలాలో పూడిక తీసి వ్యర్థాలను తొలగించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం 'నాలా వ్యర్థాలు తొలగించేది ఎప్పుడు?' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి వెంటనే అధికారులు స్పందించారు. జీహెచ్ఎంసీ సిబ్బందితో వ్యర్థాలను తొలగించారు. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లారు. దీంతో పలువురు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 11కేవీ బోరబండ ఎస్ఆర్టీనగర్ ఫీడర్ పరిధి, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, బోరబండ రామారావునగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ బేగంపేట శాంతిబాగ్, ఎర్రగడ్డ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన


భరతనాట్య ప్రదర్శన

హైటెక్ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'గాంధీ శిల్పబజార్' హస్తకళల ఉత్సవ్ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ నాట్య విద్యార్థులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

బోరబండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ రైతుబజార్ వద్ద టీ కొట్టు నిర్వహించే బోరబండకు చెందిన ముని స్వామి(44) మద్యం విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు తనిఖీ చేశారు. అతడిని అదుపులోకి తీసుకున్నారు. 90 ఎంఎల్ 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం ప్రజావాణికి 243 దరఖాస్తులు


బాలిక నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి

బేగంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో శుక్రవారం జరిగిన సీఎం ప్రజావాణికి 243 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 75, ఇందిరమ్మ ఇళ్ల కోసం 82, రెవెన్యూకు 30, ఇతర శాఖలకు చెందిన 56 దరఖాస్తులు వచ్చినట్లు నోడల్ అధికారి దివ్యదేవరాజన్ తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించారు.

ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ-ఏలో చేర్చాలి


ప్రపంచ మత్స్యకార దినోత్సవంలో ముదిరాజ్ సంఘాల నాయకులు

పంజాగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ-ఏ జాబితాలో చేర్చాలని ముదిరాజ్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వెంగళరావునగర్ డివిజన్ రహ్మత్ నగర్ చేపల మార్కెట్ బ్రిడ్జి వద్ద ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నెల్లి శంకర్ ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, నక్క రఘు ముదిరాజ్, నారాయణ, కోట్ల శ్రీనివాస్, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

యువతిపై అత్యాచార యత్నం

- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

బేగంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ఓ ఏవియేషన్ సంస్థలో విమాన పైలెట్‌గా పనిచేస్తున్న యువతిపై అదే సంస్థలో పైలెట్ అయిన 60 సంవత్సరాల వ్యక్తి బెంగళూరులో అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన బేగంపేట పోలీసులు బెంగళూరు హలసూరు పోలీస్‌స్టేషన్‌కు కేసు బదిలీ చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటలోని ఓ ఏవియేషన్ సంస్థలో యువతి(26)తో పాటు రోహిత్ శరణ్(60) కమర్షియల్ పైలెట్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల సంస్థకు చెందిన పని నిమిత్తం యువతితో పాటు రోహిత్ శరణ్ బెంగళూరుకు వెళ్లారు. అక్కడి హోటల్ గదిలో యువతితో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ఆమెను తాకకూడని చోట తాకుతూ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ప్రతిఘటించిన యువతి అక్కడి నుంచి పారిపోయి నగరానికి చేరుకుంది. రోహిత్ శరణ్ తనతో వ్యవహరించిన తీరు పట్ల బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రోహిత్ శరణ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటన బెంగళూరు హలసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగడంతో కేసును అక్కడికి బదిలీ చేశారు

అనారోగ్యంతో వ్యక్తి మృతి

అమీర్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానానికి చెందిన బోనాల కాంప్లెక్స్ ఆవరణలో అనారోగ్యంతో వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్‌కు చెందిన ఇస్సాక్(51) మూడేళ్లుగా బోనాల కాంప్లెక్స్ పరిసరాల్లో ఉంటూ మటన్ కొట్టడంతోపాటు చిన్న, చిన్న పనులు చేస్తుండేవాడు. శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో కాంప్లెక్స్ పరిసరాల్లో కిందపడిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అతడు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత విభావరి

పంజాగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎన్ మ్యూజిక్ అకాడమీ 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ గాయనీ, గాయకులచే ప్రముఖ నేపథ్య గాయకుడు, దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్వరసంజీవిని పేరుతో సంగీత విభావరి నిర్వహిస్తున్నామని అకాడమీ నిర్వాహకులు, డైరెక్టర్ ఎం.ఎస్. నవీన్ కుమార్ తెలిపారు. శుక్రవారం మధురానగర్‌లోని అకాడమీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 30, డిసెంబరు 1న రవీంద్రభారతిలో అకాడమీ 20వ వార్షికోత్సవ వేడుకలు, సంగీత విభావరి నిర్వహిస్తున్నామని తెలిపారు.

చర్చి ఆవరణలో నిర్మాణాలు నిలిపివేత

బోరబండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్‌హిల్స్ రాజీవ్ గాంధీనగర్‌లోని చర్చి ఆవరణలో చేపట్టిన నిర్మాణాలను ఖైరతాబాద్ రెవెన్యూ సిబ్బంది నిలిపేశారు. బస్తీలోని చర్చి ఆఫ్ లివింగ్ గాడ్ ఆవరణలో అక్రమంగా నిర్మాణాలను చేపట్టారని, వాటిని నిలిపేయాలని క్రైస్తవ విశ్వాసులు మనోహర్, దేవదానం, వెంకటమ్మ ఖైరతాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు చర్చి ఆవరణలో చేపట్టిన నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో ఉన్నదని, ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని ఆయన హెచ్చరించారు.

ఫతేనగర్ బ్రిడ్జి విస్తరణ నిధులు నిలిపేశారు

ఎమ్మెల్యే తలసాని

బేగంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ బ్రిడ్జి విస్తరణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపేయడంతో పనులు ఆగిపోయాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. శుక్రవారం ఫతేనగర్ ఫ్లైఓవర్ వద్ద రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యతకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, డీఈ సందీప్, హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఏడీ వంశీకృష్ణ, వాటర్‌వర్క్స్ డీజీఎం శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సురేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకుడు ఖలీల్‌బేగ్ పాల్గొన్నారు.


సనత్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని, కార్పొరేటర్ లక్ష్మి

బీసీ రిజర్వేషన్ల కోసం కలెక్టరేట్ ముట్టడి

ఖైరతాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు చట్టపరంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడికి శుక్రవారం యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పగిళ్ల సతీష్, నిరుద్యోగ జేఏసీ నేత నీల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ముట్టడిలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. బారికేడ్లను తోసేసేందుకు ప్రయత్నించగా పోలీసులకు, నిరసనకారులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డి6 ప్రకారం రిజర్వేషన్లు పెంచే అవకాశం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్లకు ప్రతిసారీ అడ్డంకులు వస్తున్న నేపథ్యంలో రాజ్యాంగ భద్రత కల్పించడమే శాశ్వత పరిష్కారమని తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు జి.అనంతయ్య, రాజేందర్, శివకుమార్ యాదవ్, అరవింద్ స్వామి, నిమ్మల వీరన్న తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ముట్టడికి యత్నిస్తున్న విద్యార్థులతో ఆర్.కృష్ణయ్య, తదితరులు

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


ఓబెదుల్లా కొత్వాల్‌తో జరిగిన సమావేశంలో విశాల్‌సుధాం తదితరులు

- మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్

బేగంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ అన్నారు. శుక్రవారం బేగంపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్‌సుధాం ఆధ్వర్యంలో పలువురు మైనార్టీ నాయకులు ఓబెదుల్లా కొత్వాల్‌తో సమావేశమయ్యారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద మైనార్టీ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ కోసం దరఖాస్తు చేసుకున్నారని, త్వరగా మంజూరయ్యేలా చూడాలని చైర్మన్‌ను విశాల్‌సుధాం కోరారు. త్వరలోనే మొదటి విడత కుట్టుమిషన్లను అందజేస్తామని చైర్మన్ తెలిపారు. సమావేశంలో లడ్డూ, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక ఐడీ అభినందనీయం


సమావేశంలో మాట్లాడుతున్న బాలునాయక్

పంజాగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక ఐడీ ఇవ్వడం అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కాలేజీ లైబ్రేరియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.బాలు నాయక్ అన్నారు. దీనిద్వారా విద్యార్థులు ఎవరైనా డ్రాప్ ఔట్ అయితే వెంటనే గుర్తించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఓ.శివకుమార్, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ సంవత్సరం టీజీపీఎస్సీ ద్వారా 1300 జూనియర్ అధ్యాపకులను, 40 మంది గ్రంథపాలకులను నియమించారని, మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. లైబ్రేరియన్లకు కూడా పదోన్నతులు కల్పించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు సందీప్, కుమార్, మహేష్, నరేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

జనవాసాల్లోకి నాగుపాము


పిల్ల నాగుపామును పట్టుకున్న స్థానికులు

యూసుఫ్‌గూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణానగర్ బీ బ్లాక్‌లోని ఓ ఇంట్లో నుంచి శుక్రవారం రాత్రి పిల్ల నాగుపాము రోడ్డుపైకి రావడాన్ని సమీపంలోని దుకాణదారులు చూశారు. జనాలు కర్రతోటి పామును కదలకుండా చేశారు. ఇంతలో ఓ వ్యక్తి స్నేక్ గ్యాంగ్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. స్నేక్ గ్యాంగ్ వచ్చి పాముని పట్టుకున్నారు. ఇళ్ల మధ్యలో పిల్ల నాగుపాము రోడ్డుపైకి వచ్చిందంటే తల్లి నాగేంద్రుడు ఎక్కడో ఉండి ఉంటుందని అక్కడ గుమిగూడిన జనం చర్చించుకున్నారు.

'గాంధీ'లో నవజాత శిశువులకు కార్పొరేట్ వైద్యం

అడ్డగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో నవజాత శిశువులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నామని చిన్నపిల్లల విభాగాధిపతి ప్రొఫెసర్ వాసుదేవ్ తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో నవజాత శిశువుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, చిన్నపిల్లల విభాగం ప్రొఫెసర్ జేఎస్ జార్జ్, డాక్టర్ అజయ్ మోహన్, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.


అమీర్‌పేట మెట్రోస్టేషన్‌లో మాట్లాడుతున్న సికిందర్‌రెడ్డి

కరెంట్ బిల్లు తగ్గించేందుకు ఉపకరణాలు

అమీర్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరెంట్ బిల్లులు తగ్గించేందుకు ఉపకరణాలను అందుబాటులోకి తెచ్చినట్లు భారత్ స్మార్ట్ సర్వీసెస్ సంస్థ సీఈఓ సికిందర్‌రెడ్డి తెలిపారు. పరిశ్రమలు, ఇళ్లలో విద్యుత్ ఆదా చేసేలా స్మార్ట్ డివైజ్ తమ ఉత్పత్తులను వాడడం వల్ల కరెంట్‌ను ఆదా చేయడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని ఆయన సూచించారు. ఐదు రాష్ట్రాల డిస్కమ్‌లతో కలిసి పనిచేస్తున్నామని, దేశవ్యాప్తంగా రూ.5 కోట్ల బిల్లులను ఆదా చేశామని తెలిపారు. అమీర్‌పేటలోని మెట్రోస్టేషన్‌లో భారత స్మార్ట్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో క్లయిమేట్ యోధా పేరుతో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఒరిస్సా, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలో తమ సర్వీస్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాండ్ ఆర్ట్ ద్వారా విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణపై సంస్థ నిర్వాహకుల ప్రదర్శన ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

'గాంధీ'లో నవజాత శిశువులకు కార్పొరేట్ స్థాయి వైద్యం

అడ్డగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో నవజాత శిశువులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని చిన్న పిల్లల విభాగాధిపతి ప్రొఫెసర్ వాసుదేవ్ తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో చిన్న పిల్లల వార్డులో నవజాత శిశువుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, చిన్నపిల్లల విభాగం ప్రొఫెసర్ జేఎన్ జార్జ్, డాక్టర్ అజయ్ మోహన్, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ సజ్జనార్

రాంగోపాల్‌పేట్ పీఎస్‌ను సందర్శించిన సీపీ

అడ్డగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ సజ్జనార్ శుక్రవారం సందర్శించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. దాదాపు 45 నిమిషాల పాటు స్టేషన్‌లో ఉన్న సీపీ రికార్డులను పరిశీలించి, సీఐ, ఎస్‌ఐలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు.

అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి


అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారితో సమావేశమైన కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. శుక్రవారం అసిస్టెంట్ సివిలల్ సప్లై అధికారి చాముండేశ్వరితో సమావేశమయ్యారు. విచారణ పేరుతో కాలయాపన చేయకుండా అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు.


జెండా ఆవిష్కరణలో గంగపుత్ర సంఘం నాయకులు

వారాసిగూడలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

బౌద్ధనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అధ్యక్షుడు ఎం.రాజలింగం, కార్యదర్శి ఎ.మల్లేష్, కోశాధికారి ఎం. గణేశ్, గంగపుత్ర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పాక గాల్లేష్, రాచమల్ల కృష్ణమూర్తి పాల్గొని గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మత్స్యకారుల జెండాను ఎగురవేశారు. గంగపుత్ర కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కందినారాయణ, ఎస్.శ్యామ్, శ్రీకాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గురుసింగ్ సభ ప్రబంధక్ కమిటీ సభ్యులు

రేపటి నుంచి గురుతేజ్‌బహదూర్ సాహెబ్‌జీ

బలిదాన దినోత్సవ వేడుకలు

బౌద్ధనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి గురుద్వారలో తొమ్మిదవ సిక్కు గురుతేజ్‌బహదూర్ సాహెబ్‌జీ 350వ బలిదాన దినోత్సవ వేడుకలను ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని గురుసింగ్ సభ ప్రబంధక్ కమిటీ సభ్యులు తెలిపారు. 23వ తేదీన చిలకలగూడ మున్సిపల్‌గ్రౌండ్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయని, సాయంత్రం విశాల్, నగరకీర్తనలుంటాయని తెలిపారు. వేడుకల పోస్టర్‌ను సీతాఫల్‌మండి గురుద్వారలో చైర్మన్లు హర్పల్‌సింగ్, కంచన్ సింగ్, అధ్యక్షుడు ప్రతాప్‌సింగ్, ఉపాధ్యక్షుడు రాజేందర్‌సింగ్, ప్రధానకార్యదర్శి రంజిత్‌సింగ్, కో-ఆర్డినేటర్ జగిత్‌సింగ్ శుక్రవారం ఆవిష్కరించారు.

కంటోన్మెంట్ భూములు కబ్జా

● పట్టించుకోని అధికారులు

బోయినపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బస్తీలతో సహ కంటోన్మెంట్ భూములు కబ్జా అవుతున్నాయి. కబ్జాలను అడ్డుకోవడానికి కంటోన్మెంట్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులకు విషయం తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. కొందరు తాత్కాలికంగా షెడ్లు వేసి కబ్జాలకు పాల్పడుతున్నాట్లు సమాచారం. కంటోన్మెంట్ భూములను కబ్జా నుంచి కాపాడాలని మార్నింగ్ వాకర్స్ డిమాండ్ చేస్తున్నారు.

లక్ష పుష్పార్చన, దీపోత్సవం



లాలాపేట్‌లోని సీతారామాంజనేయ భజన సమాజంలో శుక్రవారం లక్ష పుష్పార్చన, దీపోత్సవ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, సీతారామాంజనేయ భజన సమాజం ప్రెసిడెంట్ పోచయ్య యాదవ్, వైస్ ప్రెసిడెంట్ ఎంకే ప్రవీణ్, సెక్రటరీ లక్ష్మణరావు, ట్రెజరర్ మహేందర్, సాయినాథ్, పాండు రంగారావు, ఎంపీ కృష్ణారావు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి


మరాఠబస్తీలో ఓ ఇంటి స్లాబ్ పరిస్థితి


కూలిపోయిన మెట్లు


అధ్వానంగా ఉన్న రోడ్డు

శిథిల భవనాల్లోనే జీవనం

● ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి
● హామీలు ఇచ్చి పట్టించుకోని నేతలు
● వర్షాకాలంలో బిక్కు బిక్కుమంటూ జీవనం
● ఏళ్లు గడుస్తున్నా మారని మరాఠ బస్తీవాసుల తలరాత

అడ్డగుట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా అడ్డగుట్ట డివిజన్ మరాఠ బస్తీవాసుల తలరాతలు మారడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నో ఏళ్ల నుంచి సమస్యలు విన్నవిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎన్నికలు వచ్చినపుడు బస్తీకి వస్తున్న నాయకులు హామీలు ఇస్తున్నారే తప్ప తర్వాత తమ గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజాం కాలంలో 30 కుటుంబాలు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి లాలాగూడ రైల్వే స్టేషన్ పక్కనున్న ప్రాంతంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. బస్తీ వ్యవస్థాపకుడు సనాదన్ అప్పట్లో మాంగోగరోడి బస్తీగా నామకరణం చేశాడు. తరువాత మరాఠ బస్తీగా పిలుస్తున్నారు. ప్రస్తుతం బస్తీలో 36 కుటుంబాలు(126 మంది) నివసిస్తున్నాయి. కూలీ నాలీ చేసుకొని జీవిస్తున్నారు.

ఎన్టీఆర్ హయాంలో..

నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 1995లో మంత్రిగా ఉన్న తలసాని శ్రీనివాస్ యాదవ్ గృహనిర్మాణ పథకంలో ఇళ్లు కట్టిస్తామని బస్తీవాసులకు హామీ ఇచ్చారు. 1998లో పట్టాలు పంపిణీ చేసి ఇళ్లు కట్టించారు. ప్రస్తుతం బస్తీలోని ఇళ్లు ఎప్పుడు కూలతాయో తెలియని పరిస్థితి. వర్షాకాలంలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలోనే జీవిస్తున్నారు. ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కలెక్టర్, హౌసింగ్ బోర్డు డైరెక్టర్, కేంద్రమంత్రులను కలిసినా ప్రయోజనం లేదని వాపోయారు.

మరమ్మతులు చేయాలి

బస్తీలో శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులు చేయాలని బస్తీవాసులు కోరుతున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరిస్తే రూ. 60 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ నిధులు మంజూరు కాలేదు. ఓట్లు వేయించుకుంటున్న నేతలు తమను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మూడేళ్ల క్రితం శంకర్ అనే వ్యక్తి ఇంటిపై నుంచి కాలుజారి పడిచనిపోయాడని తెలిపారు. ఇళ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నాం



బస్తీలో భవనాలు శిథిలావస్థకు చేరాయి. వర్షం వస్తే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు, హౌసింగ్ బోర్డు చుట్టూ తిరిగి విసిగిపోయాం. ఇళ్లు ఏ సమయంలో కూలతాయో తెలియని పరిస్థితి. అధికారులు ఇళ్లకు మరమ్మతులు చేయాలి.

- సనాధన్, బస్తీ వ్యవస్థాపకుడు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేదలు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సూచించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 22 మందికి మంజూరైన రూ. 8 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మి, నాయకులు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, చంద్రశేఖర్, శైలేందర్, బెజ్జంకిరాజేశ్, అశ్విన్, సతీష్‌కుమార్, మిట్టపల్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మారేడుపల్లి: మోండా డివిజన్‌కు చెందిన శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎల్‌వోసీ పత్రాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగులు, అమర్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

ఎంఎంటీస్ రైలులో చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

● 5.3 తులాల బంగారు నగలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే ఎస్పీ చందన దీప్తి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలులో చోరీ చేసిన వ్యక్తిని లింగంపల్లి రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం మెట్టుగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే ఎస్పీ చందనదీప్తి, లింగంపల్లి జీఆర్‌పీ సీఐ రవిబాబు వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా, భక్తిమల్ల మండలం, కోసిగి గ్రామానికి చెందిన బి. వెంకటేష్ నాయక్(30) క్యాసినో బెట్టింగ్ యాప్ ద్వారా రూ. 30 లక్షలు నష్టపోయాడు. వ్యాపారంలో నష్టం రావడంతో చోరీల బాటపట్టాడు. స్నేహితుడి వద్ద కారు తీసుకుని మరో వ్యక్తికి విక్రయించాడు. ఈనెల 15వ తేదీన మహిళా ఉద్యోగి నాంపల్లిలో ఎంఎంటీఎస్‌లో ఎక్కి మహిళా బోగీలో ప్రయాణిస్తుంది. వెంకటేష్ నాయక్(30) ఆమె మెడలో ఉన్న 5.3 తులాల బంగారు మంగళసూత్రం తెంపుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని నాంపల్లి క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. విచారించగా నేరాన్ని అంగీకరించాడు. బంగారం స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఓయూ హాస్టళ్లలో ప్రవేశానికి

వయోపరిమితిని రద్దు చేయాలి

● ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లలో ప్రవేశానికి విధించిన వయోపరిమితి నిబంధనను రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీజీసెట్‌లో అర్హత సాధించి యూనివర్సిటీలో సీట్లు పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి నిరాకరించడం అన్యాయమన్నారు. పరీక్ష రాసే సమయంలో వయోపరిమితి పెట్టని యూనివర్సిటీ, హాస్టళ్లలో చేరడానికి వయోపరిమితి నిబంధన విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీటు వచ్చిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని వర్సిటీ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కొమ్మనబోయిన సైదులు యాదవ్, వీరబోయిన లింగయ్య, అశోక్, నూక మధు, ఆవుల శ్రీధర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

28న ఓయూలో పూలే వర్ధంతి సభ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 28న మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సభ నిర్వహిస్తున్నామని బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ కొమ్మనబోయిన సైదులు యాదవ్ తెలిపారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పూలే వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు లింగయ్య, బి. అశోక్, మహేష్ యాదవ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ నాయకుడికి

14 రోజుల జుడీషియల్ రిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ నాయకుడికి న్యాయమూర్తి 14 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఉప్పల ఉదయ్‌కుమార్ అక్టోబరు 31వ తేదీ ఉదయం ఓయూ పరిపాలనా భవనంలో అకడమిక్ బ్రాంచిలోకి వెళ్లి విధుల్లో ఉన్న డిప్యూటీ రిజిస్ట్రార్ బీవీ శారదను ఈక్వలెన్స్ సర్టిఫికెట్ కావాలని అడిగాడు. దానికి సంబంధించిన ధ్రువపత్రాలు కావాలని ఆమె చెప్పారు. దీంతో డిప్యూటీ రిజిస్ట్రార్‌ను ఉదయ్ బెదిరించి దూషించాడు. శారద ఫిర్యాదు మేరకు ఓయూ పోలీసులు అతడిని శుక్రవారం అరెస్ట్ చేశారు. విచారించగా తప్పును అంగీకరించాడు. ఉదయ్‌ను న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా 14 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించారు.

విద్యార్థి నాయకుడి అరెస్టు సరికాదు

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై నిత్యం పోరాడుతున్న ఉదయ్ కుమార్ అరెస్టు సరికాదని ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య అన్నారు. ఓయూ అధికారులు నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉదయ్‌ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

ముషీరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో గంగపుత్ర మహాసభ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా గంగపుత్ర వల విసిరే పోటీలను నిర్వహించారు.

పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా వెనకబడిన మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలన్నారు. రాష్ట్రంలో ఆధునిక చేపల మార్కెట్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విజేతలు వెంకటేశ్వర్లు, సంతోష్, ఉపేందర్‌కు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఫిషర్‌మన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు, గంగపుత్ర మహాసభ జాతీయ అధ్యక్షుడు ఆర్‌కే ప్రసాద్, మహిళా కమిటీ అధ్యక్షురాలు స్వరూప తదితరులు పాల్గొన్నారు.


వల విసిరే పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కారును ఢీకొట్టిన లారీ

● భారీగా ట్రాఫిక్ జామ్ ● వాహనదారుల ఇబ్బంది


ధ్వంసమైన కారు ముందు భాగం

తిరుమలగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లారీ కారును ఢీకొట్టిన ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీ సికింద్రాబాద్ నుంచి లోడ్‌తో హకీంపేట వైపు వెళ్తోంది. అదే సమయంలో కారు హకీంపేట నుంచి సికింద్రాబాద్ వస్తోంది. కోటేశ్వర దేవాలయం సమీపంలో మూలమలుపు వద్ద లారీ కారును ఢీకొట్టడంతో ధ్వంసమైంది. ఈ ఘటనతో కోటేశ్వర దేవాలయం నుంచి అల్వాల్ చౌరస్తా, బొల్లారం రిసాల బజార్, బొల్లారం వాటర్ ట్యాంక్, కౌకూర్ వరకు ట్రాఫిక్ జామ్ అవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని రోడ్డు మధ్యలో ఆగిపోయిన లారీని క్రేన్ సహాయంతో పక్కకు పెట్టించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.


విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేస్తున్న నిర్వాహకులు

ఓయూలో 'అస్మిత్' అథ్లెటిక్స్ పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలోని 'ఏ' గ్రౌండ్‌లో శుక్రవారం అస్మిత లీగ్ - 2025 పేరుతో అథ్లెటిక్స్ పోటీలను హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించింది. బాలికల్లో నైపుణ్యాన్ని గుర్తించేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ రాజేష్ కుమార్ తెలిపారు. లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, డిస్కస్ త్రో తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. నగరంలోని దాదాపు 25 పాఠశాలల నుంచి 250 మందికి పైగా విద్యార్థినులు హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ లక్ష్మీపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్నీ, హానరరీ సెక్రటరీ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న ఓయూ గెజిటెడ్ అధికారుల సంఘం ఎన్నికలు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ గెజిటెడ్ అధికారుల సంఘం ఎన్నికలకు అధికారులు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల అధికారిగా కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్ వ్యవహరించనున్నారు. ఏడు పదవులకు నామినేషన్లను ఈ నెల 24 మధ్యాహ్నం 3 గంటలలోపు అందజేయాలి. 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. 27వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 ఎన్నిక జరుగుతుందని అధికారులు తెలిపారు.


ఒబేదుల్లాతో సమావేశమైన కాంగ్రెస్ నాయకుడు విశాల్ సుధాం తదితరులు

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

బేగంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. శుక్రవారం బేగంపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విశాల్ సుధాం ఆధ్వర్యంలో మైనార్టీనాయకులు ఒబేదుల్లాతో సమావేశమయ్యారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద మైనార్టీ మహిళలు కుట్టుమిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, త్వరగా మంజూరు చేయించాలని విశాల్ కోరారు. త్వరలో కుట్టుమిషన్లు అందజేస్తామని ఒబేదుల్లా తెలిపారు.

హాస్టల్ భవనంపై నుంచి పడి యువకుడి మృతి


ఆనంద్(ఫైల్)

కవాడిగూడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు హాస్టల్ భవనం పై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. దోమలగూడ సీఐ ఎడీ అంజద్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా, అంబడపల్లికి చెందిన బాసాని ఆనంద్(26) అశోక్‌నగర్‌లో సివిల్స్‌కు కోచింగ్ తీసుకుంటూ న్యూ అంబేడ్కర్‌నగర్‌లో లోటస్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు హాస్టల్‌లో మూడో అంతస్తు నుంచి పక్క హాస్టల్ టెర్రస్‌పై పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.